క్లుప్తంగా

ఐసీడీఎస్ అధికారుల మొండి వైఖరి

మర్రిపాలెం: అంగన్‌వాడీ సమస్యలపై ఐసీడీఎస్ అధికారులు మొండి వైఖరి ప్రదర్శిస్తున్నారని అంగన్‌వాడీ కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పీఎంఎంవీవై రిజిస్ట్రేషన్, ఎఫ్‌ఆర్‌ఎస్‌లో హాజరు నమోదు చేయాలని ఒత్తిడి తీసుకురావడంతోపాటు మాట వినకుంటే కొత్త సెల్‌ఫోన్లు ఉండవని, ప్రమోషన్లు ఉండవంటూ తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని వారంతా వాపోతున్నారు. ఇప్పటికే ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్న ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజనా రిజిస్ట్రేషన్ ప్రక్రియను తమకు అప్పగించడంతో ఆన్‌లైన్ సేవలను నిలిపివేసిన అంగన్‌వాడీలు ప్రస్తుతం ఆఫ్‌లైన్ పద్ధతిలో లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ చేపట్టాలని లేని పక్షంలో అంగన్‌వాడీలకు కొత్త ఫోన్‌లు ఇవ్వబోమని, వారికి సూపర్‌వైజర్లుగా పదోన్నతి కల్పించబోమంటూ ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నట్టు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర స్థాయి యూనియన్ నాయకులకు తెలియజేస్తామని స్థానిక యూనియన్ నాయకులు తెలియజేస్తున్నారు.

మూల్యాంకన పుస్తకాల్లో ఫార్మేటివ్ పరీక్షలు

మురళీనగర్: మురళీనగర్ పరిసరాల్లోని ఉన్నత పాఠశాలల్లో సోమవారం ఫార్మేటివ్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. గతంలో ఫార్మేటివ్‌తో పాటు సమ్మేటివ్ పరీక్షలు కాగితాలపై నిర్వహించి ఓఎంఆర్ షీట్లలో జవాబులు రాసేవారు. ఈ సారి పరీక్షల కోసం ప్రత్యేకంగా మూల్యాంకన పుస్తకాలను విద్యా శాఖ తయారు చేసి అసెస్‌మెంట్ బుక్‌లెట్స్‌ను పంపింది. తరగతి, సబ్జెక్టుల వారీగా పుస్తకాలు అందజేశారు. ఫార్మేటివ్ పరీక్షను 50 మార్కులకు నాలుగు విభాగాలుగా విభజించి పరీక్ష నిర్వహించారు. వీటికి అన్నిటికి పుస్తకాల్లోనే ప్రత్యేకంగా పేజీలు కేటాయించారు. ఫార్మేటివ్ పరీక్షలకు సంబంధించి తరగతి గది ప్రతిస్పందనలు, నోట్స్ కరక్షన్స్, ప్రాజెక్టు వర్కులకు ఒక్కదానికి 5 మార్కులు కేటాయించారు. రాత పరీక్ష 35 మార్కులకు ఉంటుంది. ఇదంతా ప్రభుత్వం సరఫరా చేసిన బుక్‌లెట్‌లోనే రాయాల్సి ఉంటుంది. ఇందులోనే ఓఎంఆర్ షీటు ఉంటుంది. దీన్ని స్కాన్ చేసి మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. పుస్తకం ప్రారంభ పేజీలో విద్యార్థికి సంబంధించిన పూర్తి సమాచారం నమోదు చేయాలి.

పరీక్షల వివరాలు..

మాధవధార, ఏఎస్సార్ నగర్‌లోని కె.కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలు, మాధవధార, బర్మా కాలనీ ప్రాథమిక పాఠశాలల్లో మొదటి రోజు పరీక్షలు జరిగాయి. తెలుగు, గణితం పరీక్షలు నిర్వహించారు. మంగళవారం ప్రాథమిక పాఠశాలలకు ఇంగ్లిష్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఉన్నత పాఠశాలలకు హిందీ, 6–7 వరకు జనరల్ సైన్స్, 8–10 తరగతులకు ఫిజికల్ సైన్స్, 13న అన్ని తరగతులకు ఇంగ్లీష్, సోషల్, 14న ఉదయం 8–10 తరగతుల విద్యార్థులకు బయాలజీ పరీక్ష ఉంటుంది. మాధవధార ఉన్నత పాఠశాలలో 755 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు హెచ్‌ఎం బి.హేమలత తెలిపారు. ఫార్మేటివ్ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం 1.15 గంటల పాటు నిర్వహిస్తామన్నారు.

అమరవీరుల వేషధారణలో అలరించిన చిన్నారులు


అమరవీరుల వేషధారణలో చిన్నారులు

ఎంవీపీ కాలనీ: భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అమరవీరులుగా నిలిచిన ప్రముఖుల వేషధారణలో శ్రీ సత్యసాయి విద్యాసంస్థల చిన్నారులు అలరించారు. స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా సోమవారం శ్రీ సత్యసాయి విద్యా విహార్ యూకేజీ విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో శిక్షణ అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, నేతాజీ సుభాష్ చంద్రబోష్, ఝాన్సీ లక్ష్మీబాయి, భగత్‌సింగ్ వంటి పలువురు ముఖ్యనేతలు, అమరవీరుల వేషధారణలో సందడి చేశారు. చిన్నారులను శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు పీఆర్‌పీఎస్ నాయుడు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను సోమవారం ఉదయం ఏయూ రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, పీజీ పరీక్షల డీన్ ఆచార్య బి.మునిస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్కిటెక్చర్, సివిల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాల్లో జరుగుతున్న రెండో సెమిస్టర్ పరీక్షల నిర్వహణను పరిశీలించారు.

వా'కింగ్'

రోజూ కనీసం 10 వేల అడుగులు నడిస్తే అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని వైద్యులు చెబుతున్న మాట. నిత్యం ఇలా నడిచే వారు ఆరోగ్యం విషయంలో నిజంగా కింగ్ అని చెప్పొచ్చు. ఉరుకుల పరుగుల జీవనంలో స్వీయ ఆరోగ్యంపై చాలా వరకు శ్రద్ధ తగ్గిందనే చెప్పాలి. వీధి చివర పాల ప్యాకెట్ తేవాలన్నా బైక్‌పై వెళ్తున్నారు. కాస్త దూరం కూడా నడిచి వెళ్లలేని స్థితికి చేరుకున్నాం. మొబైల్ ఫోన్, టీవీ చూస్తూ రాత్రి లేటుగా పడుకోవడం, ఉదయం ఆలస్యంగా లేవడం చాలా మందికి అలవాటుగా మారింది. దీంతో శరీరానికి సరైన వ్యాయామం, శ్రమ తగ్గి బీపీ, సుగర్, థైరాయిడ్, ఒబెసిటీ, కొలెస్ట్రాల్ వంటి వ్యాధులు, అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. శరీరానికి సరైన శ్రమ లేకుంటే వ్యాధినిరోధక శక్తి తగ్గి వ్యాధుల బారిన పడతామని కరోనా సమయంలో చాలా మందికి అవగతమైంది. అప్పటి నుంచి ప్రజలకు ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. వాకింగ్, జాగింగ్, జిమ్, యోగా వంటి వ్యాయామాలు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

– సీతంపేట


యోగా చేస్తున్న వాకర్స్


పోర్టు స్టేడియంలో వాకింగ్ చేస్తున్న మహిళలు, పురుషులు



- అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో నిత్యం వాకర్స్ సందడి
- రోజూ నడకతో ఆరోగ్యానికి బాటలు
- ఉత్సాహంగా వాకింగ్, జాగింగ్ చేస్తున్న మహిళలు, పురుషులు, సీనియర్ సిటిజన్లు
- 690 మంది సభ్యులతో వాకర్స్ అసోసియేషన్ సేవలు

అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం వాకింగ్ చేసే వారికి చాలా అనుకూలంగా ఉంటుంది. సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో నడవడానికి విశాలమైన కాలిబాటలు, పచ్చిక బయళ్లు యోగా చేసేందుకు అనువుగా ఉంటాయి. అక్కయ్యపాలెం, సీతమ్మధార, సీతంపేట, తాటిచెట్లపాలెం ప్రాంతాలకు చెందిన ఎంతో మంది మహిళలు, పురుషులు, సీనియర్ సిటిజన్లు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడ వాకింగ్, జాగింగ్, యోగా చేస్తున్నారు. రోజూ 300 నుంచి 500 మంది వరకు వాకింగ్ చేస్తుంటారు. పోర్టు స్టేడియానికి వాకింగ్‌కు వచ్చే వారంతా కలిసి ఒక వాకర్స్ అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. దీనిలో 690 మంది సభ్యులున్నారు. వీరంతా అసోసియేషన్ సభ్యుల పుట్టిన రోజు వేడుకలు, ప్రముఖుల జయంతులు, న్యూయర్, ఈస్టర్, సత్యసాయి జయంతి వేడుకలు, ఏడాదిలో మూడు సార్లు ఉచిత మెడికల్ క్యాంప్‌లు, ట్రెకింగ్ వంటివి నిర్వహిస్తూ మంచి స్నేహ సంబంధాలతో ముందుకు నడుస్తూ ఆరోగ్యానికి బాటలు వేసుకుంటున్నారు.

వాకింగ్‌తో ప్రయోజనాలు

- ప్రతి రోజూ 45 నిమిషాలు నడకకు కేటాయిస్తే ఆరోగ్య ప్రయోజనాలున్నాయి.
- గుండె ఆరోగ్యం మెరుగుపరుస్తుంది. రక్త ప్రసరణ మెరుగై రక్తపోటు తగ్గిస్తుంది.
- కేలరీలను బర్న్ చేసి బరువు పెరుగుదలను నియంత్రించి, జీవక్రియకు మద్దతిస్తుంది. పొట్టభాగంలో కొవ్వును తగ్గిస్తుంది.
- కండరాలు, ఎముకలను బలపరుస్తుంది. జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. భోజనం తర్వాత రక్తంలో చక్కెరను నియంత్రించడంలో దోహదపడుతుంది.
- ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచి ఆక్సిజన్ ప్రవాహాన్ని శ్వాస సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది.
- ఎండార్ఫిన్, సెరోటోనిన్ విడుదలై మానసిక ఒత్తిడి, ఆందోళన తగ్గిస్తుంది. మంచి నిద్రను అందిస్తుంది.
- ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపర్చి టైప్ 2 డయాబెటీస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

రెండేళ్లుగా అసోసియేషన్ సేవలు



పోర్టు స్టేడియం వాకర్స్ అసోసియేషన్‌ను 2023లో ఏర్పాటు చేశాం. ప్రస్తుతం 690 మంది 20 నుంచి 80 ఏళ్ల వయసు గల సభ్యులున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వచ్చి వాకింగ్, జాగింగ్, వ్యాయామాలు, యోగా చేస్తుంటారు. మహిళలు, యువత, పురుషులు, సీనియర్ సిటిజన్లు వాకింగ్‌కు వస్తుంటారు. వీరిలో డాక్టర్లు, ఇంజినీర్లు, టీచర్లు, విభిన్న వర్గాల వారున్నారు. ఒకరితో ఒకరు సంభాషించుకోవడం, సలహాలు, సూచనలిస్తూ రోజూ నడక సాగిస్తున్నారు.

– ఎస్.ప్రసాదరావు, అధ్యక్షుడు, వాకర్స్ అసోసియేషన్

సంఘంలో లైఫ్ టైం సభ్యత్వం



కేవలం రూ.100తో వాకర్స్ అసోసియేషన్‌లో లైఫ్ టైం సభ్యత్వం కల్పిస్తున్నాం. ఏడాదిలో ఒక సారి ట్రెకింగ్, మూడు సార్లు ఉచిత వైద్య శిబిరాలు వాకర్స్‌కు నిర్వహిస్తున్నాం. నవంబర్‌లో పిక్నిక్ ఏర్పాటు చేస్తున్నాం. స్టేడియంలో ఉన్న సాయ్ పిల్లలకు డిన్నర్, నిత్యావసర సరకులు అందిస్తున్నాం. న్యూ ఇయర్, ఉగాది వేడుకలు, పర్యావరణ పరిరక్షణ కోసం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విడనాడాలని ప్రచారం చేస్తున్నాం.

– జి.పి.ఆర్.విఠల్, కార్యదర్శి, వాకర్స్ అసోసియేషన్

నడకతో ఆరోగ్యం పదిలం



చాలా కాలంగా పోర్టు స్టేడియంలో వాకింగ్ చేస్తున్నాను. ప్రతి రోజూ నా స్నేహితులతో కలిసి గంట సేపు నడుస్తుంటాను. ఉదయాన్నే వాకింగ్ చేయడం వల్ల రోజంతా ఎంతో చురుగ్గా దైనందిన కార్యక్రమాలు నిర్వహించగలుగుతున్నాను. వాకింగ్‌ను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకుంటే ఆరోగ్యవంతమైన జీవనం పొందవచ్చు.

– హేమలత, వాకర్

ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు



రోజూ పోర్టు స్టేడియంలో వాకింగ్, చిన్నపాటి వ్యాయామాలు చేస్తుంటాను. ప్రతి రోజూ 45 నిమిషాలు నడకకు కేటాయిస్తే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. ముఖ్యంగా రక్త ప్రసరణ మెరుగై రక్తపోటును నివారించి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. పొట్ట భాగంలో కొవ్వును తగ్గించి, కండరాలు, ఎముకలను బలపరుస్తుంది. భోజనం తర్వాత రక్తంలో చక్కెరను నియంత్రించడంలో వాకింగ్ దోహదపడుతుంది.

– డాక్టర్ కె.వి.ఎస్.ప్రసాద్, వాకర్

కంచరపాలెం కొండవాలు సమస్యలపై వినతి


జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ గంకల కవిత

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ కార్పొరేటర్ గంకల కవిత సోమవారం పీజీఆర్‌ఎస్‌లో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, మేయర్ పీలా శ్రీనివాస్‌లకు వినతి పత్రం అందించారు. వార్డులో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని, నూతన సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని, అదనపు పారిశుధ్య కార్మికులను నియమించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ కమిషనర్ తెలిపారు.

'భారతీయ వైజ్ఞానిక వైభవం' గ్రంథావిష్కరణ


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య నాగేశ్వరరావు

మురళీనగర్: నేటి వైజ్ఞానిక పురోగతికి మూలాలు భారతీయ శాస్త్ర గ్రంథాల్లో ఉన్నాయని ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు అన్నారు. ద్వారకానగర్ బీవీకే కళాశాలలో విజ్ఞాన భారతి జాతీయ కార్యదర్శి కొంపెల్ల సుబ్బరాయ శాస్త్రి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో చెరుకూరి సర్వేశ్వరరావు రచించిన భారతీయ వైజ్ఞానిక వైభవం గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రపంచంలోనే మన ఆయుర్వేదం అతి ప్రాచీన వైద్య విజ్ఞానమని పేర్కొన్నారు. మన వైజ్ఞానికుల కృషిని తెలుగులో సరళమైన శైలిలో చెరుకూరి సర్వేశ్వరరావు అందించారన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు పుస్తక సమీక్ష చేస్తూ ధన్వంతరి, చరకుడు, శుశ్రుతుడు, వరాహమిహిరుడు, భాస్కరాచార్యులు, ఆర్యభట్టు వంటి ఆరుగురు శాస్త్రవేత్తల జీవిత విశేషాలు గ్రంథం చేయడం అభినందనీయమన్నారు. వారి గ్రంథాల్లోని పలు రకాల చికిత్స విధానాలు, శరీర నిర్మాణం, మానసి రుగ్మతలకు సంబంధించిన అనేక విషయాలను చాలా లోతుగా పరిశీలించి గ్రంథాన్ని రూపొందించారని చెప్పారు. గౌరవ అతిథి డాక్టర్ కొచ్చెర్లకోట సత్యనారాయణమూర్తి, ఆచార్య పీఎస్‌ఆర్ అవధాని, ఆచార్య కె.విశ్వనాథ్, శేఖరమంత్రి ప్రభాకరరావు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో శిక్షణ కార్యక్రమాలు


శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు


ప్లాస్టిక్ నిషేధంపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయం–వాల్తేర్‌లో సోమవారం చిన్నారులకు హీరక్ పంక్, గోల్డెన్ ఏరో టెస్టింగ్ వంటి శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. అమరావతి, హైదరాబాద్ రీజియన్‌లకు చెందిన 32 కేంద్రీయ విద్యాలయాల నుంచి సుమారు 220 మంది విద్యార్థులు హాజరయ్యారు. శిబిరం ప్రాముఖ్యతను ఎల్‌వోసీ జ్యోతి వివరించారు. తొలి రోజు 10 ఏళ్ల లోపు పిల్లలకు బేస్ వైజ్ టెస్టింగ్స్.. వాసన, స్పర్శ, రుచి, బుల్ బుల్ ప్రామిస్, బుల్ బుల్ లా, సైక్లింగ్ వంటివి నిర్వహించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన, స్వచ్ఛత, సహకారం వంటి విలువలను తెలియజేస్తారు. ఈ నెల 13 వరకు మూడు రోజుల పాటు ఇక్కడ కార్యక్రమం జరుగుతుంది. కేవీ వైస్ ప్రిన్సిపాల్ బూర్‌సింగ్ మీనా, ప్రధానోపాధ్యాయురాలు వి.ఎం.శైలజ, సిబ్బంది జి వాణి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన ఆటో కార్మికులు


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు, ఆటో కార్మికులు


నగరంలో ఆటో ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నాయకులు, డ్రైవర్లు

'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం'తో రోడ్డున పడతామని ఆందోళన

మహారాణిపేట: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడం వల్ల తమ ఉపాధి కోల్పోయి రోడ్డున పడతామని విశాఖ జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం(ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మధరావు ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ఆటో కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక, ఉన్నత చదువులు చదువుకున్న వారికి ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించలేకపోవడంతో ఆటో మోటార్ రంగాన్ని ఎంచుకుని కుటుంబాలతో బతుకుతున్నామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో కార్మికులు రోడ్డున పడతారని, ఈ ప్రతిపాదనను పునఃపరిశీలించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.కాసుబాబు మాట్లాడుతూ ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా రూ.50 వేలు కట్టి ఆటోలు కొన్నామని, ఇప్పుడు ప్రయాణికులు ఎక్కకపోతే నెలసరి వాయిదాలు కట్టడం కష్టంగా మారుతుందన్నారు. సంఘ నాయకుడు షేక్ రెహ్మాన్ మాట్లాడుతూ మోటార్ కార్మికులకు జాతీయ బ్యాంకుల ద్వారా డ్వాక్రా మహిళలకు ఇచ్చేలా పావలా వడ్డీకే వాహనాలకు రుణాలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వాహన మిత్ర పథకం వెంటనే అమలు చేయాలని, పీఎఫ్, ఇతర సదుపాయాలతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో–మోటార్ డ్రైవర్లకు సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదంలో చనిపోతే రూ.15 లక్షలు మంజూరు చేయాలని, ప్రైవేట్ సంస్థలు ఓలా, ఉబర్, ర్యాపిడోలను రద్దు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సంఘ నాయకులు హేమంత్, కె.శివ, శివాజీ, శ్రీను, అవతారం, అప్పారావు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ఉపాధి సంగతేంటి?

బీచ్‌రోడ్డు: మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్న కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులకు ఏం ఉపాధి చూపిస్తుందో చెప్పాలని ఆటో కార్మికులు డిమాండ్ చేశారు. విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం విశాఖ రైల్వే స్టేషన్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 8 లక్షల మంది ఆటో కార్మికులు 24 గంటల పాటు ఆర్టీసీతో సమానంగా ప్రజా రవాణాలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ గమ్యస్థానాలకు చేరవేస్తున్నారని చెప్పారు. అలాంటి ఆటో డ్రైవర్లకు గత ప్రభుత్వానికి ఇచ్చిన వాహన మిత్ర పథకాన్ని కూడా అమలు చేయకుండా.. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రకటన చేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. తక్షణమే ఆటో కార్మికుల సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు కె.గణేష్, కోశాధికారి కె.రాము, ఆఫీస్ బ్యాలెన్స్ ఎండీ అలీ తదితరులు పాల్గొన్నారు.

సాయిరాం పార్లర్‌లో రూ.2.80 లక్షల చోరీ

- గంటల్లోనే నిందితుడిని పట్టుకున్న పోలీసులు.. సొత్తు రికవరీ

తాటిచెట్లపాలెం: డైమండ్ పార్క్ దరి సాయిరాం పార్లర్‌లో చోరీ జరిగింది. నిందితుడిని కేవలం గంటల వ్యవధిలోనే ఫోర్త్ టౌన్ పోలీసులు పట్టుకుని, చోరీ సొత్తు రికవరీ చేశారు. వివరాలిలా.. సాయిరాం పార్లర్‌లో పనిచేస్తున్న డి.కిరణ్ ఆదివారం రాత్రి వచ్చిన కలెక్షన్ సుమారు రూ.2.80 లక్షలను దొంగిలించి పారిపోయాడు. సోమవారం ఉదయం విధులకు వచ్చిన క్యాష్ సూపర్‌వైజర్ బోని రాము నగదు తనిఖీ చేయగా.. అక్కడ లేదు. వెంటనే విషయాన్ని ఫోర్త్ టౌన్ పోలీసులకు తెలియజేశాడు. దీనిపై ఫిర్యాదు నమోదు చేసిన పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సీసీ టీవీ ఫుటేజీలను తనిఖీ చేయగా.. కిరణ్ సొమ్ము దొంగిలించినట్లు తెలిసింది. సాంకేతిక పరిజ్ఞానంతో అతడి కదలికలను గమనించిన పోలీసులు నిందితుడు తాడేపల్లిగూడెంలో ఉన్నట్లు గుర్తించి, అక్కడ అతడిని అదుపులోకి తీసుకుని, చోరీ సొత్తు రూ.2.80 లక్షలను రికవరీ చేశారు. ఈ కేసు దర్యాప్తులో ఫోర్త్ టౌన్ క్రైం ఇన్‌చార్జి ఎస్ఐ మహమ్మద్ సల్మాన్ బేగ్, టూ టౌన్ ఎస్ఐ సునీల్‌లు బృందంగా ఏర్పడి చాకచక్యంగా, అతివేగంగా చర్యలు తీసుకున్నారు.

'క్యాంపెయిన్ 2025' ప్రారంభం

మహారాణిపేట: అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సోమవారం 'క్యాంపెయిన్ 2025' కార్యక్రమాన్ని ప్రారంభించి, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ ప్రచారం రానున్న రెండు నెలల పాటు జిల్లా వ్యాప్తంగా యువతపై దృష్టి సారించి హెచ్ఐవీ, ఎయిడ్స్, లైంగికంగా సంక్రమించే వ్యాధులు, మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కల్పించనుంది. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

పద్మశాలి సేవా సంఘం నూతన కార్యవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన సభ్యులు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డుకు చెందిన శ్రీభక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం (726/2022) నూతన కార్యవర్గ ఎన్నికలు సోమవారం శంకరమఠం రోడ్‌లోని పద్మశాలి భవనంలో జరిగాయి. విశిష్ట గౌరవాధ్యక్షులుగా కరణం వెంకటేశ్వర్లు, దొడ్డి చిన్నబాబు, గౌరవాధ్యక్షులుగా మాదాబత్తుల శ్రీను, ఇమంది అప్పారావు, అధ్యక్షుడిగా గుదే రాజు, కార్యదర్శిగా పప్పు ప్రసాద్, సహ కార్యదర్శులుగా పెంటకోట శ్రీను, వానపల్లి కనకరాజు, కోశాధికారిగా ఆకుల శ్రీను, దొడ్డి వాసు, మహిళాధ్యక్షురాలిగా పొన్నగంటి పార్వతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు కార్యనిర్వాహక కార్యదర్శులు గుదే త్రినాథు, బడిగింటి సురేష్, బడిగింటి శంకర్, మహిళా కార్యదర్శి సుర్లపూడి పద్మ, వానపల్లి కనకమహాలక్ష్మి, సభ్యురాలిగా పెంటకోట రమణమ్మ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘ నూతన అధ్యక్ష, కార్యదర్శులు రాజు, ప్రసాద్ మాట్లాడుతూ 25వ వార్డులో 600కు పైగా పద్మశాలి కుటుంబాలు ఉన్నాయని, 2022లో సంఘం ఏర్పాటు చేసుకుని, మూడేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. సంఘ బలోపేతానికి మరింత కృషి చేస్తామన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

సర్వే నంబర్ మార్చి అనుమతులు


అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి సమీపంలో నిర్మిస్తున్న భవనం

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి సమీపంలోని కూరగాయల బ్రిడ్జి పక్కన యూఎల్‌సీ ల్యాండ్‌లో సర్వే నంబర్ మార్చి టౌన్ ప్లానింగ్ అధికారులు ప్లాన్ మంజూరు చేసినట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. సదరు స్థలం 36 సర్వే నంబర్(యూఎల్‌సీ) కాగా.. దానిని 46 సర్వే నంబర్‌లో చూపించి ప్లాన్ మంజూరు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి నాయకుల సిఫార్సులు, పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టచెప్పినట్టు సమాచారం. 1974 డాక్యుమెంట్ ప్రకారం ఇక్కడ ఐదుగురు భాగస్తులకు మొత్తం 156 చదరపు గజాల స్థలం ఉండగా.. ఒక్కొక్కరికీ 31 గజాల స్థలం వస్తుంది. 2011 డాక్యుమెంట్ ప్రకారం 242.5 గజాల స్థలంగా చూపిస్తున్నారు. స్థలం ఎలా పెరిగిందో తెలియడం లేదని, సుమారు 86 గజాలు ఆక్రమించినట్టు స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. 1974 డాక్యుమెంట్ ప్రకారం 31 గజాల్లో ఇంటిని నిర్మించాల్సి ఉండగా.. ప్రస్తుతం భవన యజమాని సుమారు 60 గజాల స్థలంలో నిబంధనలు మీరి ఇల్లు నిర్మిస్తున్నాడు. దీనిపై ఫిర్యాదులు వస్తున్నా.. అధికారులు మాత్రం అంతా సవ్యంగానే ఉందని చెబుతున్నారు. ఈ నిర్మాణంపై గత నెల 28న స్థానిక వ్యక్తి జీవీఎంసీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు డీవియేషన్ ఉందని నిర్ధారించి, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని నోటీసులు జారీ చేసి చేతులు దులిపేసుకున్నారు. సంబంధిత అధికారులు దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

క్రమశిక్షణతోనే విద్యార్థులకు ఉన్నత స్థాయి

ఆరిలోవ: క్రమశిక్షణతో విద్యార్థులకు ఉన్నత స్థాయి లభిస్తుందని విశాఖ వ్యాలీ స్కూల్ చైర్మన్, కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. విశాఖ వ్యాలీ స్కూల్‌లో సోమవారం ఏపీజే అబ్దుల్ కలాం రాసిన 'కలలు ఆలోచనలవుతాయి, ఆలోచనలు చర్యలుగా మారుతాయి' అనే కార్యక్రమాన్ని ఇన్వెస్టర్ వేడుక – 2025 పేరుతో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పాల్గొని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్, హెచ్‌ఆర్ అడ్మిన్ డి.ఎస్.వర్మతో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి దశలో చదువుపై పట్టుదల అవసరమన్నారు. పట్టుదల, క్రమశిక్షణ గల విద్యార్థులు రాణిస్తారన్నారు. ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విద్యార్థులు సాధించిన విజయాలను వివరించారు. 10, 12 తరగతుల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు, నీట్, జేఈఈ మెయిన్స్‌లో టాపర్‌గా నిలిచారని తెలిపారు. అనంతరం ఎస్ఏఎఫ్‌లో జోనల్, ఐఏఎంలో బహుళ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని సరయుకు, ఆసియా రోలర్ స్కేటింగ్‌లో బంగారు పతకం సాధించిన గ్రీష్మకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. దీంతోపాటు విద్యార్థులకు పాఠశాల స్టూడెంట్స్ కౌన్సిల్ బ్యాడ్జిలను అందజేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.